# సాక్షి
# వికారాబాద్

శనివారం ¦ 31 ¦ ఆగస్టు ¦ 2024




**ఎఫ్‌టీఎల్.. నిర్మాణాలు ఫుల్**

తాండూరు పట్టణ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, చిలుక వాగు పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయి. 8లో▸



**జిల్లా అభివృద్ధికి కృషి**

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. 8లో▸



**పల్లె పోరుకు అడుగులు**

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం వడివడిగా అడుగులు వేస్తోంది. 8లో▸

## న్యూస్‌రీల్

### నేడు రాష్ట్రస్థాయి జానపద జాతర

బొంరాస్‌పేట: నగరంలోని రవీంద్రభారతిలో శనివారం రాష్ట్రస్థాయి జానపద జాతర నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. తెలంగాణ జానపద కళలను కాపాడుకునేందుకు ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం జరిగే ఉత్సవాలకు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రమణాచారి, రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్య హాజరవుతున్నారని చెప్పారు. రెండు రోజుల క్రితం కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణంలో నిర్వహించిన జానపద జాతర సక్సెస్ కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకుడు మెట్లకుంట వెంకటయ్య, నాందార్‌పూర్ వెంకటయ్య, దుద్యాల మండల అధ్యక్షుడు శకనప్ప, కొడంగల్ మండల అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

### అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

రావులపల్లిలో ఇంటింటి సర్వే



రైతుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

కొడంగల్: రుణమాఫీ కాని రైతుల ఫిర్యాదు మేరకు వ్యవసాయధికారులు ఇంటింటి సర్వే చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని రావులపల్లిలో సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ రాథోడ్ ఆధ్వర్యంలో ఏఈఓలు సుమ, పావని, రాజు, శ్రీపతి పర్యటించారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ చేశారు. ఆధార్, రేషన్ కార్డు, పట్టదారు పాస్‌పుస్తకాలను చూశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీలో అర్హులందరికీ న్యాయం జరుగుతుందని అధికారులు తెలిపారు.

### నూతన నియామకం



కొత్తగా ఎన్నికైన జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల అసోసియేషన్ సభ్యులు

మోమిన్‌పేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్ స్వామి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శి నర్సింలు, మహిళా కార్యదర్శిగా రూపలక్ష్మి, ఎక్జిక్యూటివ్ సభ్యుడిగా బుచ్చిరెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు.

### దృష్టి మళ్లించేందుకే హైడ్రా

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ వైఫల్యం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే హైడ్రాను తెరమీదికి తీసుకొచ్చిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. వ్యవసాయాధికారుల వద్ద రైతుల వివరాలు సరిగ్గా లేవని, సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ ఆలస్యం చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు రైతు భరోసా నిధులు విడుదల చేయలేదని, అర్హులకు పింఛన్లు ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలను అటకెక్కించిందన్నారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కొత్త పింఛన్ ఇవ్వ లేదని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొందరికే అమలవుతోందన్నారు. సర్పంచ్‌ల పాత బకాయిలను విడుదల చేయలేదని, స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి ఉందన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, డెంగీ, విషజ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపులేదన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్లు మంచె పాండు యాదవ్, చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య, మునగపాటి నవీన్, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్‌ఆర్‌పై మళ్లీ చర్చ

**ప్రాజెక్టు రిపోర్టులో నవాబుపేట మండలం**

- రెండో అలైన్‌మెంట్‌లో నవాబుపేట కాకుండా చేవెళ్ల మండలం మీదుగా వెళ్లేలా ప్లాన్
- నమూనా మార్పుపై జిల్లా ప్రజల ఆగ్రహం
- పశ్చిమాన జిల్లాను కలుపుతూ వెళ్లాలని డిమాండ్
- ఓఆర్‌ఆర్ తరహాలో అన్యాయం చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరిక




రీజనల్ రింగ్‌రోడ్డు ప్రతిపాదిత నమూనా

వికారాబాద్: రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై జిల్లాలో మరోమారు చర్చ మొదలైంది. ట్రిపుల్ ఆర్ విషయంలో జిల్లా వివక్షకు గురవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓఆర్‌ఆర్‌లో జరిగిన అన్యాయం మరోసారి జరిగితే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే మొదటి, రెండో దశకు సంబంధించి అలైన్‌మెంట్ ఖరారు కాగా మూడో దశకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి మూడో దశ గురించి అధికారులతో చర్చించిన విషయం తెలిసిందే. అభివృద్ధి, కనెక్టివిటీ, సౌకర్యాలతో ముడిపడి ఉన్న రీజనల్ రింగ్ రోడ్డు ఒక్కో దిక్కున ఒక్కో రకంగా నిర్మాణ ప్రతిపాదనలు చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఉత్తరం, తూర్పు దిక్కులకు సంబంధించి ఇప్పటికే అనుమతులు లభించగా, దక్షిణ దిక్కు నిర్మాణానికి సైతం కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టులో..**

రెండేళ్ల క్రితం డీపీఆర్(డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రాజెక్టు రిపోర్టులో నవాబుపేట మండలాన్ని చూపించారు. అయితే ఆరు నెలల క్రితం రూపొందించిన మరో అలైన్‌మెంట్‌లో నవాబుపేట కాకుండా చేవెళ్ల మండలం మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్లేలా నివేదిక ఇచ్చారు. దీంతో జిల్లా వాసుల్లో ఆందోళన మొదలైంది. పశ్చిమ భాగంలో ఉన్న పరిగి నియోజకవర్గ పరిధిలోని మన్నెగూడ వరకు 60 కిలోమీటర్ల దూరం వస్తుండగా.. ప్రతిపాదన 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న చేవెళ్ల, షాబాద్ వరకే పరిమితం చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయం గురించి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సీఎంను కలిసి చర్చించినట్లు సమాచారం. రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో జిల్లాకు అన్యాయం జరగకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

**ఇప్పటికే దక్షిణ భాగానికి అనుమతులు**

రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కేంద్రం ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి అంగీకరించడంతో రాష్ట్ర ప్రభుత్వం తుది అలైన్‌మెంట్ ఖరారు చేసి భూసేకరణ ప్రారంభించింది. రెండు విడతల్లో రోడ్డు నిర్మించేందుకు కేంద్రం అంగీకరించిన విషయం తెలిసిందే. మొదటి విడతలో నగరానికి తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో ఉన్న శాటిలైట్ పట్టణాలను కలుపుతూ 158 కిలోమీటర్ల రోడ్డును నిర్మించనున్నారు. రెండో విడతలో పశ్చిమం, దక్షిణాన ఉన్న ప్రాంతాలను కలుపతూ 182 కిలోమీటర్లు రోడ్డును నిర్మిస్తారు.

**ప్రస్తుత అలైన్‌మెంట్‌తో..**

ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ సమయంలో పశ్చిమం మినహా మిగతా దిక్కుల్లో హైదరాబాద్‌కు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరం నుంచి ఓఆర్‌ఆర్ నిర్మించారు. ఇదే పశ్చిమం దిక్కున మాత్రం హైదరాబాద్‌కు ఆనుకుని కేవలం 9 నుంచి 10 కిలోమీటర్ల దూరంలోనే ఓఆర్‌ఆర్ నిర్మించారు.. దీంతో పశ్చిమాన ఉన్న వికారాబాద్ ప్రాంతం వైపు అభివృద్ధి, కనెక్టివిటీ కొంత దూరానికే పరిమితమైంది. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు సైతం పశ్చిమానికి నష్టం జరిగేలా కనిపిస్తోంది. రీజనల్ రింగ్‌రోడ్డు టచ్ చేస్తూ వెళుతున్న నగరానికి ఉత్తరం దిక్కున గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్ పట్టణాలు 50 నుంచి 67 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దక్షిణాన మర్రిగూడ, శివన్నగూడ 70 నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇదే సమయంలో పశ్చిమాన ఉన్న షాబాద్, చేవెళ్ల పట్టణాలు కేవలం 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. ఉత్తరం వైపున తీసుకున్న దూరాన్నే పడమర వైపున కూడా వర్తింపజేస్తే వికారాబాద్ జిల్లా పరిధిలోని మన్నెగూడ సమీపం నుంచి వెళ్లే అవకాశం ఉంది.

**రీజనల్‌తో ఎన్నో లాభాలు**

రీజనల్ రింగ్‌రోడ్డు అందుబాటులోకి వస్తే చుట్టు పక్కల ప్రాంతాలు, పట్టణాలు, గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయి. హైదరాబాద్‌కు కనెక్టివిటీ పెరుగుతుంది. స్థానికంగా ఉపాధి, ఉత్పాదకత పెరుగుతుంది. రోడ్డుకు రెండు వైపులా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుంది. భూముల ధరలు పెరుగుతాయి. మోమిన్‌పేట్, నవాబుపేట, శంకర్‌పల్లి, వికారాబాద్, పరిగి తదితర పట్టణాల మీదుగా వెళ్లే రహదారులు ఫోర్‌వే లేదా సిక్స్ లేన్లుగా మార్చితే నగరానికి కనెక్టివిటీ పెరుగుతుంది. దీంతో పశ్చిమాన ఉన్న వికారాబాద్ జిల్లాలో రైతులు కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల వంటివి నగరానికి తరలించి లాభాలు పొందే అవకాశం ఉంటుంది.

**రీజనల్ రింగ్‌రోడ్డు ప్రతిపాదిత ప్రాంతాలకు హైదరాబాద్‌కు ఉన్న దూరం కిలోమీటర్లలో..**

| | |
|---|---|
| చౌటుప్పల్ | 52 |
| భువనగిరి | 50 |
| యాచారం | 53 |
| గజ్వేల్ | 63.1 |
| సంగారెడ్డి | 65.4 |
| నవాబుపేట | 64. 7 |
| చేవెళ్ల | 40 |
| షాబాద్ | 50 |
| షాద్‌నగర్ | 50 |
| అమనగల్లు | 65.4 |
| శివన్నగూడ | 70 |
| మర్రిగూడ | 90 |
| సంస్థాన్ నారాయణపూర్ | 62 |
| కంది | 62 |
| జగదేవ్‌పూర్ | 67 |
| నర్సాపూర్ | 58.7 |

**సీఎంను ఒప్పిస్తాం**



గత పాలకులు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ విషయంలో పశ్చిమ భాగానికి అన్యాయం జరిగేలా రూపొందించారు. ఈ విషయమై అప్పట్లో ఆందోళన కూడా చేశాం. ఇటీవల సీఎంను కలిసి చర్చించా. అవసరమైతే మరో సారి కలుస్తా. రీజనల్ రింగ్ రోడ్డు జిల్లా మీదుగా వెళ్లేలా అలైన్‌మెంట్ తయారు చేయిస్తాం. ఎట్టి పరిస్థితుల్లో జిల్లాకు అన్యాయం జరగకుండా చూస్తాం.

– టి.రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే



శివసాగర్ ప్రాజెక్టును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# ఎన్నికల సామగ్రి తరలించండి

**కలెక్టర్ ప్రతీక్‌జైన్**

అనంతగిరి: వికారాబాద్ మార్కెట్ యార్డు స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న జిల్లా ఎన్నికల గిడ్డంగికి తరలించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డులో చేవెళ్ల పార్లమెంట్‌కు సంబంధించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను భద్రపరిచారు. శుక్రవారం స్ట్రాంగ్ రూం తాళాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో తెరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వికారాబాద్, తాండూరు, పరిగి శాసనసభ నియోజకవర్గాల బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను జిల్లా గిడ్డంగికి తరలించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాసరావు, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, తారాసింగ్, ఆనంద్‌కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నయామత్ అలీ, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**'శివసాగర్'లోకి మురుగు చేరకుండా చూడాలి**

వికారాబాద్ పట్టణ పరిధిలోని శివసాగర్ ప్రాజెక్టులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రాజెక్ట్ కాలువను, మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ దుకాణ సముదాయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ జాకీర్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివసాగర్ ప్రాజెక్టు నుంచి వికారాబాద్‌కు తాగునీరు తరలిస్తుంటారని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడే ఈ ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పూడూరు మండలంలోని కొన్ని గ్రామాల నుంచి వచ్చే మురుగు ప్రాజెక్టులోకి చేరుతోందని, కాలువల ద్వారా మురుగును మళ్లించాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుందర్‌ను ఆదేశించారు. అలాగే ప్రాజెక్టులో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. సమీకృత మార్కెట్‌లో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

# అన్ని జ్వరాలు డెంగీ కావు

- ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదు
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

చేవెళ్ల: అన్ని జర్వం కేసులు డెంగీ కావని, ప్రజలు భయపడాల్సిన పనిలేదని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ, వార్డులు, ల్యాబ్, ఫార్మసీ గదులు, డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడే ఉన్న వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంగీ, సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. వైద్యం ఎలా అందిస్తున్నారని వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విషజ్వరాలు, డెంగీ కేసులకు సంబంధించి ఆస్పత్రుల్లో వసుతులపై పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల ఆస్పత్రిలో టీహబ్ ద్వారా మినీల్యాబ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం వస్తున్న జ్వరాలతో ప్రజలు భయపడాల్సి పని లేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కావాల్సిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, వైద్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, హెడ్‌నర్స్ స్నేహలత ఉన్నారు.



బషీరాబాద్: విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

# టీచర్లను సర్దుబాటు చేస్తాం

- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో బోధనకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- డీఈఓ రేణుకాదేవి

యాలాల/బషీరాబాద్: ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు నష్టం జరగకుండా సర్దుబాటు చేస్తామని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. శుక్రవారం బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను ఆమె సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో 64 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో బోధన సరిగ్గా జరగడం లేదని పిల్లల తల్లిదండ్రులు వారం రోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలను డీఈఓ సందర్శించారు. ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో బోధనకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు వచ్చేలా బోధన జరగాలని ఉపాధ్యాయులకు సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దన్నారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**నైపుణ్యం పెంపొందించేందుకే కాంప్లెక్స్ సమావేశాలు**

ఉపాధ్యాయుల్లో బోధనా పరమైన నైపుణ్యాలు పెంపొందించేందుకు కాంప్లెక్స్ సమావేశాలు తోడ్పడతాయని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. శుక్రవారం యాలాల మండలం అగ్గనూరు పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థ బోలోపేతానికి ఆధునిక నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. ఇందులో భాగంగానే హరివిల్లు జాయ్‌ఫుల్ లర్నింగ్ పద్ధతి ద్వారా విద్యార్థుల్లో విలువలు పెరుగుతాయన్నారు. ఎఫ్‌ఎల్‌ఎస్ పుస్తకాలతో వర్క్‌బుక్ సామర్థ్యాలను పెంపొందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు మొగులయ్య, మురహరినాథ్, ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఇందిరమ్మ కాలనీ, బామ్లానాయక్ తండా పాఠశాలలను డీఈఓ తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. తెలుగు, ఇంగ్లిష్ రీడింగ్ స్కిల్స్ పరిశీలించారు. ఆమె వెంట హెచ్‌ఎం యూనుస్, సీఆర్పీ శ్రీనివాస్ ఉన్నారు.



యాలాల: అగ్గనూరు కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న డీఈఓ, ఉపాధ్యాయులు

# ప్రధాన కూడళ్లపై ఫోకస్

- కొడంగల్, కోస్గి పట్టణాల్లోని చౌరస్తాల విస్తరణకు ప్లానింగ్
- ప్రతిపాదించిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని పనులు

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి పట్టణాల్లో ప్రధాన కూడళ్ల విస్తరణకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకున్నారు. కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా రెండు జాతీయ రహదారులను కలిపే వేదికగా మారింది. హైదరాబాద్ – బీజాపూర్, బూత్పూర్ – మన్నాకెల్లి జాతీయ రహదారులు అంబేడ్కర్ చౌరస్తాలో కలుస్తాయి. ఈ చౌరస్తాను విస్తరించి మెయిన్ సెంటర్‌గా మార్చడానికి అధికారులు ప్లానింగ్ సిద్ధం చేశారు. 2009, 2014లో రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ చౌరస్తాను విస్తరించడానికి పలు మార్లు కృషి చేశారు. అయితే వివిధ కారణాలతో విస్తరణకు నోచుకోలేదు. తదనంతరం జరిగిన పరిణామాల మధ్య హైదరాబాద్ – బీజాపూర్ అంతర్రాష్ట్ర రహదారిని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా మార్చింది. రెండో జాతీయ రహదారిగా మహబూబ్‌నగర్ – చించోలీ (ఎమ్‌సీ) రోడ్డును జాతీయ రహదారిగా మార్చింది. కాకతాళీయంగా ఈ రెండు జాతీయ రహదారులు కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా మీదుగా వెళ్తున్నాయి. దీంతో ఈ చౌరస్తాను విస్తరించి జంక్షన్‌గా మార్చడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. కోస్గిలోని శివాజీ చౌరస్తాను కూడా విస్తరించడానికి ప్లాన్ సిద్ధం చేశారు. ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపారు. అనుమతులు రాగానే విస్తరణ పనులను ప్రారంభించనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ విషయంపై వికారాబాద్, నారాయణపేట జిల్లాల ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లినట్లు తెలుస్తోంది.



కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా

**జాతీయ రహదారిగా ఎమ్‌సీ రోడ్డు**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కొడంగల్ తాండూరు మీదుగా కర్ణాటక రాష్ట్రం చించోలీ వరకు జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. దీన్ని ఎన్‌హెచ్ 167గా పేరు పెట్టారు. మహబూబ్‌నగర్ నుంచి హన్వాడ, గండీడ్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా ఈ రహదారిని నిర్మిస్తున్నారు. బెంగళూరు ముంబై జాతీయ రహదారులను కలిపే ఈ రహదారి సుమారు 150 కిలోమీటర్లు పొడవు ఉంది. వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్లు, కర్ణాటక రాష్ట్రంలో 50 కిలోమీటర్లు, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 55 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. జాతీయ రహదారి నిర్మాణం వల్ల వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని పలు గ్రామాలకు రవాణా వ్యవస్థ మెరుగు పడనుంది.

**రూ.630 కోట్లతో పనులు**

మహబూబ్‌నగర్ – చించోలీ (ఎమ్‌సీ) జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.630 కోట్లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా చించోలి, మన్నాకెల్లి వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మించనున్నారు. అయితే కొడంగల్ పట్టణంలోని వినాయక చౌరస్తాను విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ చౌరస్తాను విస్తరించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు వినాయక చౌరస్తా సమీపంలో ఉన్నాయి. నిత్యం వేలాది మంది విద్యార్థులతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటోంది. ప్రయాణికులను ఎక్కించుకోడానికి దించడానికి ఆర్టీసీ బస్సులు కూడా ఇక్కడే ఆగుతాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.



అధికారులు సిద్ధం చేసిన కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా ప్లాన్



కోస్గిలోని శివాజీ చౌరస్తా ప్లాన్

## క్లుప్తంగా

### ఇసుక తరలిస్తున్న ఆటో పట్టివేత

యాలాల: కాగ్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ఆటోను యాలాల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కోకట్ కాగ్నా నదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా నదిలో నుంచి ఇసుకను తరలిస్తున్న ఓ ఆటోను గుర్తించి పట్టుకొని ఠాణాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### కుటుంబ కలహాలతో మేస్త్రీ ఆత్మహత్య

కుల్కచర్ల: కుటుంబ కలహాల నేపథ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సొర్ల చెన్నయ్య(28) నగరంలో మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఆయన రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు చూసే సరికే ఆయన మృతి చెందాడు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే చెన్నయ్య ఆత్మహత్యకు పాల్పడ్డారని గ్రామస్తులు ఆరోపించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

యాలాల: విద్యుదాఘాతంతో ఓ ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అగ్గనూరు శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అక్కంపల్లి నర్సింహులుకు చెందిన ఓ ఎద్దు ఎప్పటిలాగే మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లింది. ఈ క్రమంలో పొలాల సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ తీగకు ఎద్దు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న బాధిత రైతు ఎద్దు కళేబరం వద్దకు చేరి లబోదిబోమన్నాడు. సుమారు రూ.40వేల విలువ గల ఎద్దు మృతి చెందడంతో తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరాడు.

### విధులకు వెళ్తూ.. అనంత లోకాలకు

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ ఉద్యోగి దుర్మరణం


అశోక్ (ఫైల్)

చేవెళ్ల: ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇబ్రహీంపల్లి బస్‌స్టేజీ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గ్రామానికి చెందిన అశోక్(58) వికారాబాద్ జిల్లా తాండూరులో విద్యుత్ శాఖలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి డ్యూటీ కోసం తాండూరుకు కారులో బయలు దేరాడు. మార్గమధ్యలో ఇబ్రహీంపల్లి బస్‌స్టేజీ వద్ద అతివేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రమీల, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

### ఉరేసుకుని రైతు ఆత్మహత్య

యాచారం: వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామానికి చెందిన కర్రె మదారు(50) కొద్ది రోజులుగా వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో తన వ్యవసాయ పొలం వద్దే గురువారం రాత్రి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో కూడా మదారు మూడుసార్లు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.




తాండూరు పట్టణంలో మట్టి పోసి చదును చేసిన పాతకుంట


పాతకుంట స్థలంలో నిర్మించిన భవనాల మధ్య నిలిచిన నీరు (ఫైల్)

# ఎఫ్‌టీఎల్.. నిర్మాణాలు ఫుల్!

**చెరువులు, కుంటలు, వాగులను ఆక్రమించిన కబ్జాకోరుల గుండెల్లో హైడ్రా వణుకు పుట్టిస్తోంది. హైదరాబాద్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత కొనసాగుతోంది. ఇదిలా ఉండగా తాండూరు పట్టణంలో అన్యాక్రాంతమైన చెరువులు, కుంటలను కాపాడేందుకు ఇక్కడ కూడా హైడ్రా తరహా కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి.**

- అక్రమార్కుల చేతుల్లో కుంటలు, చెరువులు
- ప్లాట్లుగా మార్చి విక్రయించిన వైనం
- తాండూరులో హైడ్రా తరహా చర్యలకు డిమాండ్


గొల్ల చెరువు

తాండూరు: పట్టణంలో ఉన్న చెరువులు, కుంటలతో పాటు చిలుకవాగు పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయి. ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్), బఫర్‌జోన్ స్థలాలు ఆక్రమించి అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టారు. పట్టణంలో మొత్తం 5 కుంటలు, 2 చెరువులు ఉన్నాయి. వీటిలో రాయికుంట, తుమ్మల కుంట, పుల్చెరువు కుంట, పాత కుంట, గొల్లచెరువు, మల్‌రెడ్డిపల్లి చెరువుతోపాటు పాత తాండూరు ప్రాంతంలో బోనమ్మ కుంటలు ఇప్పటికే అన్యాక్రాంతమయ్యాయి.

**కబ్జా కోరల్లో గొల్ల చెరువు**

మున్సిపల్ పరిధిలోని గొల్ల చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఈ చెరువు దాదాపు 81.13 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని కింద గతంలో 87 ఎకరాల ఆయకట్టు భూములు సాగయ్యేవి. చెన్‌గేష్‌పూర్, అంతారం, మల్‌రెడ్డిపల్లి చెరువులతో పాటు గొల్ల చెరువుకు గొలుసుకట్టు చెరువులుగా అనుసంధానంగా ఉన్నాయి. ఒకచెరువు నిండితే అలుగు పారి వాగుల ద్వారా గొల్ల చెరువులోకి వచ్చేవి. అయితే వాగులన్నీ కబ్జాకు గురికావడంతో చెరువులకు గొలుసుకట్టు తెగిపోయింది. మరోవైపు గొల్ల చెరువు ఎఫ్‌టీఎల్ భూమిని కబ్జా చేయడంతో కాలనీ వెలిసింది. దాదాపు 15 ఎకరాలు ఎఫ్‌టీఎల్ భూమి ఆక్రమణకు గురైంది. మరోవైపు ఎఫ్‌టీఎల్ పరిధిలోని 2 ఎకరాల భూమిలో తాండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం కొనసాగుతోంది.

**పాతకుంటలో పదెకరాలు మాయం**

సాయిపూర్ ప్రాంతంలో పుల్చెరువు కుంట, రాయి కుంట, తుమ్మల కుంట, పాత కుంట, సాయికుంటలున్నాయి. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ఇవి కరుమరుగయ్యాయి. సాయిపూర్ ప్రాంతంలో ఉన్న పుల్చెరువు కుంటలో ప్రభుత్వ పాఠశాల వెలిసింది. మరోవైపు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల్లో పెద్ద ఎత్తున భవనాలు నిర్మించారు. పాత కుంటలో సుమారు 10 ఎకరాల భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లింది. నాలుగేళ్ల క్రితం కుంటను పూర్తిగా మూసి వేసి పార్క్ ఏర్పాటు కోసం శంకుస్థాపన సైతం చేశారు.

**చెరువులను పరిరక్షించాలి**

గొల్ల చెరువులో 14 ఎకరాల వరకు అన్యాక్రాంతమైంది. మిగిలిన ఎఫ్‌టీఎల్ భూమి కబ్జా కాకుండా చూసుకొనే బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంది. ఇప్పటికే కాలగర్భంలో కనుమరుగైన పాతకుంట వంటి మిగతా మూడు కుంటలు కనిపించకుండా పోయాయి. ఈ వ్యవహారంపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేశా.

– రాజ్‌గోపాల్‌సార్డా, పర్యావరణవేత్త, తాండూరు

**చర్యలు తీసుకుంటాం**



చెరువులు, కుంటల్లో కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. గతంలో ఎఫ్‌టీఎల్ భూమిలో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయ నిర్మాణాలు జరిగినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో హైడ్రా తరహాలో చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ సూచన మేరకు అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఆర్డీఓ, తాండూరు

# హక్కులపై అవగాహన ఉండాలి


బొంరాస్‌పేట: మాట్లాడుతున్న ఎస్సై ఎండీ.రవూఫ్


యాలాల: జుంటుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

యాలాల: పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యాలాల తహసీల్దార్ అంజయ్య, ఎస్ఐ శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జుంటుపల్లిలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పౌరహక్కులకు భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ శాంతియుతంగా పండుగను జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మెట్లకుంటలో..**

బొంరాస్‌పేట: భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్సై ఎండీ.రవూఫ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మెట్లకుంటలో రైతు వేదికలో ఎస్సై అధ్యక్షతన పౌరహక్కుల దినాన్ని నిర్వహించారు. పౌరులకు ఉన్న హక్కులను, వాటిని కాపాడేందుకు ఉన్న చట్టాలను ఎస్సై వివరించారు.

**చట్టాలపై అవగాహన అవసరం**

పూడూరు: రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కండ్లపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని అన్నారు.

### ఆలయంలో చోరీకి యత్నం

నిందితుడి అరెస్టు


కిష్టప్ప (ఫైల్)

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీకి యత్నించిన ఓ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కోత్లాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర కిష్టప్ప బుధవారం రాత్రి గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయంలో ఉన్న హుండీని ఇనుపరాడ్డుతో పగలగొట్టాడు. గురువారం ఆలయ సిబ్బంది ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహించారు. గతంలో పలుమార్లు చోరీకి పాల్పడి జైలు శిక్ష అనుభవించిన కిష్టప్పను పోలీసులు విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో ఆయన్ని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించించారు. అతనిపై గతంలో నాలుగు కేసులు ఉన్నాయని ఎస్ఐ తెలిపారు.

# జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

- దోమలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: ప్రజా సంక్షేమం కోసం అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసి ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఎంతో మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న రైతులకు 70 శాతం మేరకు రుణమాఫీ కాగా మిగతా వారికి వివిధ కారణాలతో కాలేకపోయిందన్నారు. వారి నుంచి సైతం దరఖాస్తులను వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. జిల్లాతో పాటు పరిగి మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు తీసుకెళ్లడంతో పాటు పూడూర్‌లో రూ.2,500 వందల కోట్లతో నేవీ రాడర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు, రైతులు వివిధ సమస్యలను ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. రెవెన్యూ సమస్యలతో పాటు రుణమాఫీ, గృహజ్యోతి సమస్యలను లబ్ధిదారులు ఎమ్మెల్యేకు దరఖాస్తు రూపంలో అందించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే రాక కోసం ఆలస్యమవ్వడంతో లబ్ధిదారులు నిరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఎంపీఓ సోమలింగం, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యసాగర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# అదును చూసి.. ఇల్లు గుల్ల

**19 తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాల అపహరణ**


బీరువాలో చిందరవందరగా పడేసిన సామగ్రి


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పెద్దేముల్: దైవ దర్శనానికి వెళ్లొచ్చే సరికే ఇల్లు గుల్లయిన సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. 19 తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారని యజమాని లబోదిబోమన్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ పిన్నెముల గోపాల్‌రెడ్డి వ్యవసాయంతో పాటు సుద్ద వ్యాపారం చేస్తారు. రెండు రోజుల క్రితం గోపాల్‌రెడ్డి ఆయన భార్య తుంగభద్రతో కలిసి శ్రావణమాసం ముగుస్తుందని నరసింహస్వామి దర్శనం కోసం యాదగిరిగుట్టకు వెళ్లారు. తిరిగి గురువారం అర్ధరాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటి ప్రధాన ద్వారం తీయడంతో సామగ్రి అంతా చిందరవందరగా పడి ఉంది. వెంటనే ఇళ్లంతా పరిశీలించారు. బీరువాలో దాచిన బంగారు ఆభరణాలు సైతం కనిపించడం లేదు. దీంతో దంపతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు సోదాలు చేపట్టారు. యజమాని భార్య తుంగభద్ర 19 తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలు చోరీ జరిగినట్లు పోలీసులు ఫిర్యాదులో విన్నవించారు. వాటి విలువ దాదాపు రూ.13 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ గిరి పరిశీలించారు. వీలైనంత తొందరగా దొంగలను పట్టుకుంటామని డీఎస్పీ ప్రకటించారు.

# ఉత్సవ కమిటీ భూమిని కాపాడండి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్**


ఖాంజాపూర్ గుట్ట వద్ద బీజేపీ నాయకులు

తాండూరు: తాండూరు హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన స్థలంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం పట్టణ శివారులోని ఖాంజాపూర్ గుట్టపై హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన స్థలాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఖాంజాపూర్ గుట్ట ప్రాంతంలో హిందూ ఉత్సవ సమితికి, ముస్లిం మతస్తులకు స్థలం కేటాయించారన్నారు. అయితే ముస్లింలకు కేటాయించిన భూమిలో ఈద్గాను అభివృద్ధి చేసుకున్నారన్నారు. కానీ హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన భూమిని అభివృద్ధి చేయడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. మరోపక్క హిందూ సమాజానికి కేటాయించిన భూమిలో రాత్రి పగలు మట్టి తవ్వకాలు చేస్తున్నారన్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని హిందువులకు కేటాయించిన స్థలంలో అభివృద్ధి చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, నాయకులు భద్రేశ్వర్ తదితరులున్నారు.

# బందోబస్తు ఏర్పాటు చేయండి

**డీఎస్పీ, సీఐలను సన్మానించిన హిందూ ఉత్సవ కేంద్ర సమితి**


డీఎస్పీని సన్మానిస్తున్న హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు

తాండూరు టౌన్: రానున్న వినాయక చవితి ఉత్సవాలకు తాండూరు పరిధిలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు శుక్రవారం కోరారు. ఇటీవల ఎన్నికైన సమితి నూతన కార్యవర్గ సభ్యులు డీఎస్పీ, పట్టణ సీఐ సంతోష్ కుమార్‌లను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో హిందూ పర్వదినాలు కొనసాగేలా చూడాలని కోరారు. మంటపాల వద్ద, ఉత్సవ ఊరేగింపు, నిమజ్జన ప్రదేశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షులు రాజుగౌడ్, కోశాధికారి భానుప్రసాద్, ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు పరిమళ్, రఘు, నరేష్, దావులయ్య, నర్సింహ్మ, రామకృష్ణ, కిరణ్ తదితరులు ఉన్నారు.

# ఉద్యమాల ఉపాధ్యాయుడికి ఘన వీడ్కోలు


సత్తయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: టీపీటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చెర్క సత్తయ్య పదవీ విరమణ సందర్భంగా గ్రామస్తులు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామన్ మెగసెస్ అవార్డు గ్రహీత శాంత సిన్హా, ఎంవీఎఫ్ వెంకట్రాంరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చెర్క సత్తయ్య ఉద్యమ నేపథ్యం, ఉన్నతమైన ఉపాధ్యాయుడిగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ హరిచందర్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్ వివిధ ఉపాధ్యాయ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పల్లె పోరుకు అడుగులు

**స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం వడివడిగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా గ్రామాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే వార్డులో ఉంచేలా ప్రక్రియను ప్రారంభించింది. దీంతో ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆశావహులు ఓటర్ల ప్రసన్నం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.**

- కొనసాగుతున్న ఓటర్ల సర్దుబాటు ప్రక్రియ
- సిద్ధమవుతున్న ఆశావహులు


గోకాఫసల్వాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం గత ఫిబ్రవరి 1న ముగిసిన విషయం తెలిసిందే. వారి పదవీకాలం ముగియడంతో 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన గ్రామాల్లో కొనసాగుతుంది. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కసరత్తులు మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు ఒక కుటుంబానికి సంబంధించిన వారి ఓట్లు ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం వార్డుల వారీగా ఓటర్ల సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ప్రక్రియ మూడు రోజుల క్రితమే ప్రారంభమైంది. దీంతో గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. అనంతరం ముసాయిదా సిద్ధం చేసి ఆయా పంచాయతీ పరిధిలోని ఓటర్లకు అందుబాటులో ఉంచనున్నారు. వాటి నుంచి వచ్చే అభ్యంతరాలపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు స్వీకరించనున్నారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత వచ్చే నెల 21న వార్డుల వారీగా తుది జాబితాను విడుదల చేయనున్నారు.

**35 గ్రామ పంచాయతీలు**

మండలంలో 35 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా జీపీల్లో 292 వార్డులు ఉన్నాయి. మొత్తం మండల ఓటర్లు 33,595 మంది ఉన్నారు. ప్రస్తుతం వార్డుల వారీగా ఓటర్లు సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతుంది. దీంతో పదవీపై ఆశలు పెట్టుకున్న నాయకులు ఇప్పటినుంచి వ్యూహాలు రచిస్తున్నారు.

**ప్రజల మద్దతుకు ఆశావహుల పాట్లు**

వార్డుల వారీగా ఓటర్ల జాబితా సర్దుబాటు ప్రక్రియ గ్రామ పంచాయతీల్లో ప్రారంభం కావడంతో రాబోయే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలలో పోటీ చేసేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ రాబోయే సర్పంచ్, వార్డు స్థానాలలో పోటీ చేయాలనుకుంటున్నానని మీతో పాటు మీ కుటుంబ సభ్యుల సహకారం కావాలని హడావుడి మొదలు పెట్టారు. తోచిన రూపంలో ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.


ఓటర్ల సర్దుబాటు అంశంపై కార్యదర్శితో చర్చిస్తున్న ఎంపీఓ (ఫైల్)

**సర్దుబాటు చేస్తున్నాం**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ వార్డుల వారీగా ఓటర్ల సర్దుబాటు కొనసాగుతుంది. అందులో భాగంగానే ఆయా జీపీల కార్యదర్శులు ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్, ఎంపీఓ, దౌల్తాబాద్